క్లుప్తంగా

రేపు బోనాల పండుగ

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని కృష్ణా టాకీస్ సమీపంలోని ఊర ముత్యాలమ్మ అమ్మవారి బోనాల పండుగను ఆదివారం నిర్వహించనున్నారు. పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ముత్యాలమ్మ దేవస్థాన కమిటీ శుక్రవారం తెలిపింది. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఉద్యోగులు

తుంగతుర్తి : మండల కేంద్రంలో తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథలుగా మారిన ఇద్దరు ఆడపిల్లలకు దాతలు ఆర్థికసాయం అందజేశారు. నల్లగొండ జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూ.6500 ఆర్థికసాయాన్ని జిల్లా అధ్యక్షుడు మాతంగి వీరబాబు శుక్రవారం బాలికలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగులు రంగోజు గిరిధర్, మారం రాజ్ వంశీ, ఎండీ నజీర్, కత్తుల నేతాజీ, మొగలగాని వంశీగౌడ్, అంబటి రాములు, తడకమల్ల రవికుమార్, అంబటి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

రామనర్సయ్య ఆశయాలను కొనసాగిస్తాం

తిరుమలగిరి : పొట్ల రామనర్సయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో పొట్ల రామనర్సయ్య స్థూపం నిర్మాణానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొట్ల రామనర్సయ్య నిరుపేద కుటుంబంలో జన్మించి, తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నడిపిన గొప్ప ప్రజా నాయకుడని అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో తిరుమలగిరిలో స్థూపం నిర్మిస్తున్నామని, అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్ర అఖిల్‌కుమార్, పేర్ల నాగయ్య, లక్ష్మన్న, కందుకూరి కొండయ్య, రాజ్‌కుమార్, యాదగిరి, సోమన్న, భాస్కర్ పాల్గొన్నారు.

నిధులున్నా.. పనులు సున్నా!



పూర్తిగా బీటీ లేచిపోయిన రోడ్డు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొత్తగూడెం రోడ్డు బీటీ రెన్యువల్‌కు నిధులున్నా నిష్ప్రయోజనంగా మారింది. అర్వపల్లి నుంచి చాకలిగూడెం మీదుగా కొత్తగూడెం వరకు ఈరోడ్డు బీటీ రెన్యువల్‌కు నాలుగేళ్ల కిందట రూ.71లక్షలు మంజూరయ్యాయి. కానీ ఇంతవరకు పనులు ప్రారంభంకాలేదు. ఈ రోడ్డు పూర్తిగా బీటీ లేచిపోయి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు రోడ్డు మరింత దెబ్బతిన్నది. దీంతో ఈ రహదారిపై వాహనాలు వెళ్లడం ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు బీటీ రెన్యువల్ పనులను పూర్తిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.


గడ్డివాము దగ్ధం

చివ్వెంల : మండల కేంద్రంలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు తెలి పిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొణ తం అప్పిరెడ్డి తన వ్యవసాయ బావి వద్ద సుమారు 600 మోపుల గడ్డి వామును ఉంచారు. అయితే శుక్రవారం మధ్యాహ్న సమయంలో సమీపంలోని విద్యుత్ వైర్ల వల్ల షార్ట్ సర్క్యూట్ ఏర్పడి గడ్డివాముకు మంటలు అంటుకున్నాయి. ఇది గమనించిన పలువురు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే వచ్చి మంటలను చల్లార్చారు. అప్పటికే గడ్డి పూర్తిగా దగ్ధమైంది.

నీటిని విడుదల చేయాలి

నాగారం : ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గుడిపురి వెంకటేశ్వర్లు, కడియం కుమార్, దేవరకొండ యాదగిరి, కందే భిక్షం, తంగెళ్ల వెంకన్న పాల్గొన్నారు.

పనిచేయని ఆర్వో ప్లాంట్..



మూసివేసి ఉన్న ఆర్వో ప్లాంట్ గది

అర్వపల్లి : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ 20 రోజులుగా పనిచేయడంలేదు. ప్లాంట్ మిషన్, ఇతర సామగ్రి పనిచేయకపోవడంతో వాటర్‌ప్లాంట్‌ను బంద్ చేశారు. ప్లాంట్ మూతపడటంతో ప్రైవేట్ ఆర్వో ప్లాంట్‌ల వద్ద క్యాన్ నీటిని రూ.10 నుంచి రూ.15 వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్వో ప్లాంట్‌ను వెంటనే మరమ్మతు చేయించి స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



జలమయమైన అర్వపల్లి కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్ సముదాయం



అర్వపల్లి సంత ఆవరణ..

అర్వపల్లి : అర్వపల్లిలో గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి అంతా అతలాకుతలంగా మారింది. అర్వపల్లి శివారులోని కస్తూరిబాగాంధీ బాలికల కళాశాల, జెడ్పీహెచ్ఎస్‌లు మరోసారి జలమయమయ్యాయి. కేజీబీవీ మొత్తం నీటితో నిండిపోవడంతో విద్యాలయానికి సెలవులు ప్రకటించారు. బాలికలను శుక్రవారం వారి వారి ఇళ్లకు పంపించారు. అలాగే జెడ్పీహెచ్ఎస్ కూడా వర్షపు నీటితో నిండి చెరువును తలపిస్తోంది. అర్వపల్లిలో గుట్ట నుంచి వచ్చే వరద గతంలో సంత నుంచి జాజిరెడ్డిగూడెం దారి గుండా చెరువుకు వెళ్లేది. అయితే ప్రస్తుతం ఈ నీళ్లు చెరువుకు వెళ్లడానికి దారి లేకపోవడంతో సంత ఆవరణ, జనగామ రోడ్డులోని పలు ఇళ్లు జలమయమయ్యాయి. పశువైద్యశాల నీటితో నిండిపోయి అందులోని సామగ్రి, మందులు తడిసి పాడయ్యాయి.

బహుళజాతి కంపెనీలపై పోరాడుతాం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : విదేశీ బహుళ జాతి కంపెనీలు మన దేశాన్ని విడిచి వెళ్లే వరకు పోరాటాలు కొనసాగిస్తామని అరుణోదయ జిల్లా కార్యదర్శి కంచనపల్లి సైదులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏపూరు గ్రామంలో అరుణోదయ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ల దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్న బహుళ జాతి కంపెనీలు భారత్ నుంచి వైదొలగాలన్నారు. విదేశీ బహుళ జాతి కంపెనీలైన అమెజాన్, వాల్ మార్ట్, ఓలా, ఊబర్ లాంటి సంస్థలు ఆహారం నుంచి అన్ని రకాల వస్తువులను విక్రయిస్తూ దోపిడీ కొనసాగిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్ర ఉమేష్, ఏఐకేఎంఎస్ నాయకులు సుదగాని రవిగోపాల్, పీడీఎస్‌యూ నాయకులు పవన్, బోర లెనిన్, హమాలీ యూనియన్ నాయకులు ధర్మపురి రాములు, ఎస్కే ఇబ్రహీం, వీరబోయిన రామచంద్రయ్య, పీవైఎల్ నాయకులు కుంట రవి, కొమ్మ గంగయ్య, చిలువేరు లింగయ్య, కలకోట మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత..?

నాగారం : సూర్యాపేట నుంచి జనగామ వెళ్తున్న ఆర్టీ బస్సులో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి, సుమారు 9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కామారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు బ్యాగులో గంజాయి తీసుకొని సూర్యాపేటలో జనగామ బస్సు ఎక్కినట్లు తెలుస్తోంది. అనంతరం వారు నాగారంబంగ్లా ఎక్స్‌రోడ్డు వద్ద బస్సు దిగి అనుమానితంగా సంచరిస్తూ.. తుంగతుర్తి వైపు బస్సులో వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా సుమారు 9కేజీల గంజాయి పట్టుబడినట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందిస్తున్న కొప్పుల వేణారెడ్డి, పాల్గొన్న నాయకులు

సూర్యాపేట : నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని ఏపీసీసీ మాజీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌజ్‌లో ఎంపీ రఘువీర్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా అధైర్య పడొద్దని, కాంగ్రెస్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతు భాస్కర్, అంజద్ అలీ, కక్కిరేణి శ్రీను, వేములకొండ పద్మ, ఎలిమినేటి అభినయ్, నాగుల వాసు, జావెద్ బేగ్, బాలు గౌడ్, శబరి, సాయినేత పాల్గొన్నారు.

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మేకల రాజశేఖర్



రాజశేఖర్

పెన్‌పహాడ్ : పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మండల పరిధిలోని తంగెళ్లగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న మేకల రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగల నరేష్, మండల అధ్యక్షుడు సంద్యాల వినోద్, ప్రధాన కార్యదర్శి నల్లా శ్రీనివాసులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరి తెలపాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తెలపాలని సీపీఎం వాణిజ్య భవన్ శాఖ కార్యదర్శి బొమ్మిడి లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ బీసీల రిజర్వేషన్లపై చేస్తున్న ఎత్తుగడను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలన్నారు. రిజర్వేషన్లపై బీజేపీ అసెంబ్లీలో మద్దతు తెలుపుతూ పార్లమెంట్‌లో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం వాణిజ్య భవన్ శాఖ నాయకులు చిత్రము భద్రమ్మ, గోగుల సురేష్, ధనమ్మ, జ్యోతి, జగన్, ఆసిఫ్, త్రివేణి పాల్గొన్నారు.

12న 'చలో హైదరాబాద్'



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలగిరి : ఈ నెల 12న హైదరాబాద్‌లో జరిగే ముదిరాజ్‌ల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తిరుమలగిరిలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేడబోయిన యాదగిరి, ఉపేందర్, నర్సింహ, యాకయ్య, మహేష్, నరేష్, సురేష్, శ్రీనివాస్, మహేష్, అంజయ్య, ఉప్పలయ్య, సుమన్, వెంకటేష్, యాకయ్య పాల్గొన్నారు.

2నుంచి సామాజిక చైతన్యయాత్రలు



మాట్లాడుతున్న మద్దె అంజిబాబు

నాగారం : సూర్యాపేట జిల్లాలో ఈ నెల 2 నుంచి 18 వరకు జరిగే అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మద్దె అంజిబాబు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కల్లుగీత కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడి అమరులైన వారి త్యాగాన్ని స్మరించుకుంటూ, గౌడ, గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేటలో చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రూ.12.96కోట్ల ఎక్స్‌గ్రేషియా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ చైతన్య యాత్రలో కల్లుగీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బత్తుల జనార్దన్, బాలగని రేణుక, బాలగాని మురళి, మొగుల మహేష్, బుర్ర ఎల్లాగౌడ్, ఆకుల నాగయ్య, బండి ఉప్పలయ్య, పాదిలి లింగయ్య, లోడే రవి, నాతి ఉపేందర్, ఎరుకల వీరన్న, చిత్తులూరి వెంకటయ్య, మొల్కాపురి అవిలయ్య, నాతి మధు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం

పెన్‌పహాడ్ : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ ఆంగోతు యాదగిరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో షీ టీమ్స్, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై పోలీసు కళాబృందంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ మోసాలకు గురికావద్దని, బ్యాంకుఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దని సూచించారు. ఆకతాయిలు ఎవరైనా వేధింపులకు గురిచేసినట్లయితే షీ టీమ్‌కు సమాచారం అందించాలని తెలిపారు. యువత లోన్‌యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆసియా జబీన్, కానిస్టేబుల్ వంశీ, కళాబృందం ఇన్‌చార్జి యల్లయ్య, సభ్యులు గోపయ్య, చారి, గురులింగం, నాగార్జున, కృష్ణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

మూసీనదికి పెరిగిన వరద

అర్వపల్లి : హైదరాబాద్‌లో కుండపోతగా కురుస్తున్న వర్షాలతో మూసీనదికి వరద రోజురోజుకూ పెరుగుతుంది. ఈ వరద ప్రవాహం శుక్రవారం ఒక్కసారిగా మరింతగా పెరిగింది. జాజిరెడ్డిగూడెం శివారులో మూసీనది ఉధృతంగా ప్రవహిస్తోంది.



జాజిరెడ్డిగూడెం సమీపంలో నిండుగా ప్రవహిస్తున్న మూసీనది

వైభవంగా వరలక్ష్మీ వ్రతం



సూర్యాపేట అర్బన్ : పూజల్లో పాల్గొన్న భక్తులు

సూర్యాపేట అర్బన్ : శ్రావణమాసం రెండవ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో శుక్రవారం శ్రీసంతోషిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శివరామకష్ణ శర్మ తెల్లవారుజామునే శ్రీసంతోషిమాతకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించి, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధి లోని శ్రీచక్రంకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీసంతోషిమాత ఉద్యాపన వ్రతం నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. శ్రావణ మాసం రెండవ శుక్రవారం కావడంతో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఒకరికి ఒకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అమ్మవారికి ప్ర త్యేక ఊయలలో పవళింపు సేవా కార్యక్రమం నిర్వహించారు. అలాగే రుద్ర హోమం, లలితా హోమం జరిపారు. రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సతీమణి పటేల్ లావణ్య ఆలయంలో జరిగిన వరలక్ష్మీ వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్త, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రామమూర్తి, ఉప కోశాధికారి కొత్తా మల్లికా ర్జున్, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, దేవరశెట్టి సోమ య్య, సోమ శ్రీశైలం, బెలిదే అశోక్, పబ్బా ప్రకాశరావు, బ్రాహ్మండ్ల శివప్రసాద్, నూక రవి శంకర్, గోపారపు రాజు, మహంకాళి ఉపేందర్, తోట లచ్చ య్య, బ్రాహ్మండ్లపల్లి నాగమణి, కర్నాటి సూర్యకళ, గాయం శ్రీదేవి, తెడ్ల పల్లవి, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లితోపాటు జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వేడుకలను నిర్వహించారు. స్థానిక భరద్వాజ ఆశ్రమంలో నిర్వహించిన వేడుకల్లో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, రామకృష్ణచక్రవర్తి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : వరలక్ష్మి వ్రతం పురస్కరించుకొని తిరుమలగిరి మున్సిపాలిటీతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్ ప్రత్యేక పూజలు చేశారు.





సూర్యాపేటలోని సంతోషిమాత ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

దండుమైసమ్మ ఆలయ ధర్మకర్తల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ ఎన్నికలో పాల్గొన్న సర్వోత్తమ్‌రెడ్డి, వేణారెడ్డి

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయ ధర్మకర్తల మండలి నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మకర్తల కమిటీని సూర్యాపేట మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు సర్వోత్తమ్ రెడ్డి ప్రకటించారు. ఎంపికైన కమిటీతో ఈట కుశలయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ చైర్మన్‌గా ఆత్మకూర్ మండల కేంద్రానికి చెందిన తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి, డైరెక్టర్లుగా నెమ్మికల్‌కు చెందిన ఎరుకల సర్వయ్య, జంగా బాలరాజు, మోరపాక రాజు, రేణిగుంట్ల సునీత, పుష్పాల శీను, గోపగాని లక్ష్మి, పేరం శ్రీనివాస్, కాసర్ల రాంరెడ్డి, వీరబోయిన రేణుక, చెరుకుపల్లి రాంబాబు, బోర రాంమల్లు, బొడ్డుపల్లి విజయలక్ష్మి, మొరపాక లచ్చయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్‌గా ఎన్నికైన కరుణాకర్ రెడ్డితో పాటు సభ్యులను స్థానికులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు శివ శ్రీనివాస్, జవ్వాజ సత్యనారాయణ రెడ్డి, ముసుగు రామచంద్రారెడ్డి, కోన అయోధ్య, పాండు నాయక్, తంగెళ్ల పెదవీరారెడ్డి, దామిడి రమేష్‌రెడ్డి, కాకి లక్ష్మమ్మ, మండల మహిళా శాఖ అధ్యక్షురాలు తంగెళ్ల లక్ష్మి, మూల ఎల్లయ్య, బిచ్చ నాయక్, రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

వికలాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : ఈనెల 11న తుంగతుర్తిలో నిర్వహించే సూర్యాపేట – తుంగతుర్తి నియోజకవర్గాల వికలాంగుల మహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పూర్వ విద్యార్థుల భవనంలో వీహెచ్‌పీఎస్ మండల సమావేశాన్ని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.జహీర్‌బాబా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లను పెంచాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా వికలాంగుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బొడ్డు విజయ్ కుమార్, మండల అధ్యక్షుడు మేడి కృష్ణ, గంట భిక్షపతి, కొప్పుల కళింగ రెడ్డి, ములకలపల్లి వెంకన్న, కృష్ణ యాదవ్, నాయకులు దారమల్ల నగేష్, బూడిద రామచంద్రు, మడిపల్లి శ్రీనివాస్, ఘని, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రక్షా బంధన్ వేడుకలు



నూతనకల్ : రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

మద్దిరాల : మండల కేంద్రంలోని సెయింట్ పీటర్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా రాఖీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాఖీలు కట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాములునాయక్, నాగార్జున ఒలింపియాడ్ పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకన్నగౌడ్, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో శుక్రవారం రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తిరుమలగిరి : కృష్ణవేణి పాఠశాలలో..




మద్దిరాల : సెయింట్ పీటర్స్ పాఠశాలలో..

శాశ్వత పరిష్కారం చూపాలి

అర్వపల్లి : వర్షాలు కురిసిన ప్రతిసారి అర్వపల్లిలోని కేజీబీవీ జలమయమై ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కోరారు. జలమయమైన కేజీబీవీని గురువారం సందర్శించి మాట్లాడారు. తాత్కాలిక మరమ్మతులు చేస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. వర్షపు నీరు కేజీబీవీలో నిలువకుండా చెరువులోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్

మద్దిరాల : తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీఓ వేణుమాధవ్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని మీసేవ కేంద్రన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధలను సక్రమంగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయేషా పర్వీన్, డీటీ కంఠమయ్య, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బండ్ల ఊరేగింపు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కుంచమర్తి గ్రామంలో శుక్రవారం శ్రావణ మాసం వేడుకల్లో భాగంగా గ్రామ దేవతల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లు, ఇతర వాహనాలను అందంగా అలంకరించారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వాహన యజమానులు పాల్గొన్నారు.



కుంచమర్తి గ్రామంలో ఆలయాల వద్ద నిలిపిన ప్రభ బండ్లు